# పాదయాత్రలతో శాసనసభకు

## ఎన్టీఆర్ ఘాట్ నుంచి తెదేపా

## పాత ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి వామపక్షాలు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ప్రజాసమస్యలపై అసెంబ్లీలో రాజీలేని పోరాటం కొనసాగించాలని తెదేపా, వామపక్షాలు నిర్ణయించాయి. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని నిరసిస్తూ.. వర్షాకాల సమావేశాల తొలి రోజే వేర్వేరుగా పాదయాత్రలతో కదంతొక్కాయి. తెలుగుదేశం శాసనసభ్యులు పార్టీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఘాట్ నుంచి శాసనసభ వరకు పాదయాత్ర నిర్వహించారు. వైఎస్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అవినీతి పెచ్చుమీరిందని చంద్రబాబు ఈ సందర్భంగా ఆరోపించారు. ఇటీవల వచ్చిన వర్షాలు, వరదల వల్ల.. ప్రాజెక్టుల్లో నాణ్యత లోపాలే గాక.. ప్రభుత్వ అవినీతి కూడా బయటపడిందన్నారు. రైతులకు సకాలంలో సరిపడా ఎరువులు అందించలేని పరిస్థితిలో సర్కారు ఉందని దుయ్యబట్టారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు ఉదయం 9 గంటలకే చంద్రబాబుతో పాటు నందమూరి హరికృష్ణ, ఎమ్మెల్యేలంతా ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకున్నారు. ఎన్టీఆర్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

సీపీఎం, సీపీఐ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పాదయాత్రను సీపీఐ కార్యదర్శి కె.నారాయణ ఉదయం 9.30 గంటలకు హైదర్‌గూడలోని పాత ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ శాసనసభాపక్ష నేతలు నోముల నరసింహయ్య, చాడ వెంకటరెడ్డిలు మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, డీజిల్ కొరత, విద్యుత్ కోతలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుసమస్యలు, ధరలు తదితర సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి (సీపీఎం) మెడలో ఖాళీ ఎరువుల సంచిని వేసుకుని పాదయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.